## క్లుప్తంగా

### మొండి బకాయిదారులకు నోటీసులు



ఇంటి ముందు నోటీసు అంటిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరం ఇంటిపన్ను, కొళాయి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు మంగళవారం అధికారులు నోటీసులు అందజేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు నోటీసులు అందజేస్తూ కోర్టులో దావా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఆస్తిపన్ను చెల్లించని బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.

### వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రేణిగుంట(శ్రీకాళహస్తి): మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ–ఏ 3, బీసీ–ఏ మహిళ 1, బీసీ–బీ 7, బీసీ–డీ 1, బీసీ–ఈ 2, ఓసీ 9, ఓసీ మహిళ 1, ఎస్సీ 1, ఎస్టీ 1 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఆపై అర్హత ఉన్న 18–35 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 19వ తేదీ విధుల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

### వైఎస్సార్ సీపీ నేత మృతి



డిష్ ధర్మయ్య

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ నాయకుడు,మాజీ కౌన్సిలర్ డిష్ ధర్మయ్య మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. పార్టీలో కష్టపడే మనస్తత్వం ఉన్న ధర్మయ్య మృతి బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇంకా పలువురు పార్టీ నేతలు సంతాపం తెలిపారు.

### ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



మన్నసముద్రంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ షణ్ముగం

ఏర్పేడు: వరి సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చని ఏఓ షణ్ముగం తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నసముద్రం, బండారుపల్లెలో పొలంబడి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీసీజన్ 15, 048 షుగర్ లెస్ వరి రకాన్ని రైతులు విస్తారంగా నాటారని చెప్పారు. లేత దశలో వెన్నులు రావడంతో రైతులు ఆందోళన చెందున్నారని వివరించారు. రాత్రిళ్లు అధిక తేమ, పగలు తక్కువ ఉష్ణోగ్రతలు ఉండడంతో లేత దశలో వెన్నులు వస్తాయని తెలిపారు. నివారణకు ఎకరాకు 20 కిలోల పోటాషియం, 20 కిలోల యూరియాను పిచికారీ చేయాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, రైతులు పాల్గొన్నారు.

### డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు లాభదాయకం



డ్రమ్ సీడర్‌తో వరి నాటుతున్న రైతు

బుచ్చినాయుడుకండ్రిగ : డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. మంగళవారం పదవమైలు గ్రామంలో డ్రమ్‌సీడర్‌తో వేస్తున్న వరి నాట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో నాట్లతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు. డ్రమ్ సీడర్‌ను ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్రమ్ సీడర్‌తో సాగు చేస్తే వరిపంటలో కలుపు తగ్గుతుందని, కూలీలతో పని ఉండదన్నారు. ఎంపీఈఓలు పాల్గొన్నారు.

### మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరిలో మంగళవారం మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు రాచగున్నేరికి చెందిన రాణెమ్మ(55) పారిశ్రామికవాడ సమీపంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు దాడులు నిర్వహించడంతో 10 బాటిళ్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా, జడ్జి ఆమెకు రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

# సంక్షేమానికి సాక్ష్యం.. సంకల్ప యాత్ర



నారాయణవనం: పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఊపిరిపోసిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం నారాయణవనంలో వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు ఆదిమూలం పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో పేదల కష్టాలను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 'నవరత్నాలతో' రాష్ట్రంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సీఎం తీసుకొచ్చిన సంస్కరణలతో దళారీల వ్యవస్థ పూర్తిగా కనుమరుగై, పారదర్శకంగా గడప వద్దకే ప్రభుత్వ సేవలు, పాలన అందుతున్నాయని తెలిపారు. 'కులం చూడం, మతం చూడం, పార్టీలు అసలే చూడం...పేదరికం ఒక్కటే అర్హతకు ప్రామాణికం' అన్న మాటలను జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పేదల ఇళ్ల నిర్మాణంలో ఊహించని పురోగతిని సాధించినట్లు చెప్పారు. సాంఘిక భద్రత, ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించే క్రమంలో పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ఆర్థిక సాయం, ఆరోగ్య సంరక్షణ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం తమ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. పెన్షన్‌ను అంచెలంచెలుగా రూ.3 వేలకు పెంచినట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం జగనన్న ఆవిష్కరించనున్నారని, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగననన్న పాలన సాగుతోందన్నారు. విజయవాడకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అంబేడ్కర్ అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, చిన్నదొరై, ఊరప్ప, గురుస్వామి, సుబ్రమణ్యం, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ : పాల్గొన్న పార్టీ నాయకులు

**పాదయాత్ర చారిత్రాత్మకం**

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ఓ చరిత్రకమని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఉగ్గుమూడిసంధ్య తెలిపారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు అయిన సందర్భంగా బుచ్చినాయుడుకండ్రిగలో మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుని, అధికారంలోకి రాగానే అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను అమలు చేశారని తెలిపారు. ఇలాంటి పాలన రావాలంటే మళ్లీ జననన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, మాజీ సర్పంచ్ గురవయ్య, నాయకులు జయచంద్రనాయుడు, సాయినాయుడు, ప్రసాద్‌పాల్, గిరి, రాజయ్య, గురప్ప నాయుడు, కిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద తెలంగాణ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ అండ్ వాటర్ రిసోర్స్ కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి, కాణిపాకం ఆలయ పాలకమండలి చైర్మన్ మోహన్‌రెడ్డి, సభ్యులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

# సిపాయి భరోసా అందజేత



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పల్లంపేట ఎస్సీ కాలనీకి చెందిన యానాది బోడెయ్య కుటుంబానికి మంగళవారం సిపాయి భరోసా అందించారు. బోడెయ్య(58) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆ గ్రామానికి వెళ్లి సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరకులను అందజేశారు. డాక్టర్లు బాబు, వెంకటాద్రి, శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణయ్య, వెంకటయ్య, మూర్తి, వెంకయ్య, శంకరయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మండల స్థాయి క్రీడలు



సత్యవేడు: బాలుర హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పీడీ మురళీతో కలసి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. సచివాలయ, పంచాయతీస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈక్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో క్రీడా ప్రాంగణంలో పోటీలు ఉంటాయన్నారు. ఎంఈఓలు కే.రవి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

**కేవీబీపురంలో..**

కేవీబీపురం: ఆడుదాం–ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి మండల కేంద్రంలో ప్రారంభమవుతాయని ఎంపీడీఓ రామచంద్ర పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు క్రీడాకారులు మైదానానికి చేరుకోవాలన్నారు.

# సామాజిక న్యాయం సంతకాల సేకరణ



జెర్సీలను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పిచ్చాటూరు: మండలంలోని పులికుండ్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆడుదాం–ఆంధ్ర జర్సీలను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్‌లు కిరణ్‌కుమార్, దిలీప్ రాజు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

### పవిత్ర అక్షింతల పంపిణీ



అక్షింతలతో ఊరేగింపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నెహ్రూవీధి శ్రీరామాలయంలో మంగళవారం సాయంత్రం అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలు, రామాలయం ఫొటో, కరపత్రాలను భక్తులకు పంపిణీ చేశారు. నెహ్రూవీధి నుంచి నాలుగు మాడ వీధుల గుండా శ్రీరామలువారి చిత్రపటాన్ని ఊరేగించారు ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో అక్షింతలను తీసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ కోలా ఆనంద్, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు మంగిరెడ్డి, శ్రీరాములవారి భక్తబృందం పాల్గొన్నారు.

# పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం



సుబ్బరాయులు



జానకిరామన్



పర్వీన్ బేగం



ప్రసాద్

నారాయణవనం: పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర నాయకుడు జోగి గురుమూర్తి ఎన్నికల అధికారిగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా సుబ్బరాయులు, అధ్యక్షుడిగా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జానకీరామన్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా పర్వీన్ బేగం, మహిళా కార్యదర్శిగా జీవితను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని హెచ్‌ఎం సులోచన, ఉపాధ్యాయులు అభినందించారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ భూమిగా నాటిన బోర్డు

సత్యవేడు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జరీనా హెచ్చరించారు. మండల పరిధిలోని పేరడం గ్రామంలోని రెడ్డి గుంట చెరువు 193,194 సర్వే నంబర్లలో కొందరు ప్రభుత్వ భూమి ఆక్రమించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్, వీఆర్‌ఓ, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ భూమిగా బోర్డు నాటి ఆక్రమణను అడ్డుకొన్నారు.

# గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



మురళీ మోహన్,

పిచ్చాటూరు: మండలంలోని శివగిరి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు పి.మురళీ మోహన్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు నింద్ర మండలం కావనూరుకు చెందిన ఆయన పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం తెల్లవారు జామున 5 గంటలకు గుండెపోటు వచ్చింది. భార్య, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె 4వ తరగతి, చిన్న కుమార్తె 3వ తరగతి చదువుతున్నారు. ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు, సహ ఉపాధ్యాయులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఎంఈఓలు తెలిపారు. భౌతికకాయాన్ని స్వగ్రామమైన కావనూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

### అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగ పాత ఎస్టీ కాలనీలో మంగళవారం అడ్డూరు రాణెమ్మ(44) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ శ్రీహరి కథనం.. రాణెమ్మ గ్రామానికి చెందిన కొందరి నుంచి రూ.లక్ష అప్పు చేసింది. అప్పు తీర్చలేకపోవడంతో మనస్తాపానికి గురైంది. మంగళవారం ఇంటి వరండాలోని ఇనుప హుక్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వంద శాతం పింఛన్ల పంపిణీ



సత్యవేడు : స్విమ్స్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మంగళవారం నాటికి వలంటీర్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు 100 శాతం పింఛన్లు అందజేశారు. నూతనంగా పింఛన్ మంజూరైయిన వారు ఇంటికే వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు.

**తిరుపతికి వెళ్లి..**



బీఎన్‌కండ్రిగ : పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సత్యవేడు: తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని నరసరాజు అగ్రహారం గ్రా మానికి చెందిన ఎం. సుబ్రమణ్యం (72)కు వలంటీర్ రేవతి మంగళ వారం పింఛన్ అందజేశారు. ఆయన ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుని వెల్ఫేర్ అసిస్టెంట్ శ్యామ్యూల్ సహకారంతో వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ అందేశారు. వలంటీర్ సేవలను అధికారులు,స్థానికులు అభినందించారు.

# బీఎన్‌కండ్రిగలో అపరిచితుల సంచారం



వివరాలు చెబుతున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఈబీసీ కాలనీలో అపరిచితుల సంచారంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని కొందరు గ్రామంలోకి ప్రవేశించారు. ఒకతను ఒక ఇంటి తలుపుతట్టి భోజనం కావాలని అడిగాడు. ఈ సమయంలో భోజనం లేదని ఇంటి యజమాని మందలించి పంపాడు. అతను మరో ఇంటికి వెళ్లి తలుపులు గట్టిగా తట్టడంతో ఇంట్లోని వారు భయాందోళనకు గురయ్యారు. వెంటనే కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు రావడంతో అగంతుకుడు పారిపోయాడు. స్థానికులు వెంబడించడంతో అతనితో మరి కొందరు ఉన్నట్టు గుర్తించారు. పట్టుకోవాలని ప్రయత్నించగా అందరూ పారిపోగా, ఒకడు మాత్రమే పట్టుబడ్డాడు. అతన్ని వివరాలు అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. అనుమానం వచ్చి అతన్ని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారిస్తున్నారు.

### ఈవీఎంలపై అవగాహన



చిన్న పాండూరులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు, పెద్ద పాండూరు, వరదయ్యపాళెం పోలింగ్ కేంద్రాల వద్ద మంగళవారం ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్‌ఐ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ శర్మ, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

రేణిగుంట(శ్రీకాళహస్తి): పేదప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యసిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నాయకులు వెంకటేష్, నాగరాజు, వెంకటేష్, బాలిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : శిబిరంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

**ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం**

ఏర్పేడు: మండలంలోని మల్లిమండలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ గిడ్డయ్య మాట్లాడుతూ స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. 301 మందికి పరీక్షలు చేసి మందుల కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు సుధీర్‌కుమార్, డాక్టర్లు నాగరాజు, మధురిమ పాల్గొన్నారు.

**నాగలాపురం మండలంలో..**

నాగలాపురం: మండలంలోని నందనం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని నిర్వహించారు. 310 మందికి చికిత్సలు అందించారు. వైద్యాధికారి అరుణ్ కిషోర్ మాట్లాడుతూ రుయా ఆస్పత్రి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి మందులు అందించారని తెలిపారు. అడిషినల్ డీఎం హెచ్ఓ మృధులవాణి శిబిరాన్ని పరిశీలించారు. సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**సత్యవేడు మండలంలో..**

సత్యవేడు: పెద్ద ఈటిపాకం సచివాలయ పరిధిలోని రాచపాళెంలో పాండూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాన్ని నిర్వహించారు.తిరుపతి రుయా డాక్టర్లు ధనశేఖర్(పీడియార్టిస్), లోకేష్ ప్రసాద్(ఆర్థో), పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అనిత, ఆప్తమాలజీ టెక్నీషియన్ తేజస్వి 362 మంది రోగులను పరీక్షించి. మందులు అందజేశారు. సర్పంచులు గోవిందస్వామి, రూబెన్ ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీహెచ్ఓ రవీంద్ర పాల్గొన్నారు.

**కేవీబీపురం మండలంలో..**

కేవీబీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య అన్నారు. మండలంలోని కోటమంగాపురం సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు అందించారు. సర్పంచ్ తిరుపాల్‌యాదవ్, నేతలు నందకుమార్, లాల్ బాబు యాదవ్, ఎంపీడీఓ రామచంద్ర, సర్పంచ్‌లు బాలాజీ, రామ్మోహన్‌వర్మ పాల్గొన్నారు.

**పిచ్చాటూరు మండలంలో..**

పిచ్చాటూరు: రామాపురం సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 251 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. చిన్నపిల్లల స్పెషలిస్ట్ భార్గవ్, జనరల్ సర్జన్ పూజ, పీహెచ్‌సీ వైద్యాధికారులు హమీద్, మునిచరిత్ర పరీక్షలు చేశారు. 47 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ యుగంధర్ రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటచలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భా స్కర్ నాయుడు, సర్పంచ్ కిరణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం మండలంలో..**

వరదయ్యపాళెం: సంతవేలూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. 363 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. సురక్ష పర్యవేక్షణ అధికారి ప్రభావతి స్థానికులతో మాట్లాడారు. ప్రత్యేక వైద్యులు భాగ్యలక్ష్మి, చంద్ర, ద్వైత వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సర్పంచ్ నందయ్య తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడు: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ధనశేఖర్



నాగలాపురం : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



ఏర్పేడు: మందుల కిట్లు అందజేత